క్లుప్తంగా

మొక్కలు నాటిన విద్యార్థులు


తల్లంపాడు సమీపంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

దొరవారిసత్రం: మండల పరిధిలోని జాతీయ రహదారి వెంబడి నేషనల్ హైవే, స్వర్ణ టోల్ వే అధికారులు ఉమ్మడిగా తల్లిపేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మావిళ్లపాడు ఆదర్శ పాఠశాల విద్యార్థులతో మంగళవారం వివిధ రకాల మొక్కలు నాటించారు. మొక్కలు నాటడం ప్రతి విద్యార్థి విధిగా తీసుకుని పర్యావరణం కాపాడాలని హైవే అధికారులు విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైవే అధికారులు పీడీ ఎంకే చౌదరి, డీఎం సుభాన్షు, నిర్వహణ మేనేజర్ హరిపాండురంగస్వామి, ప్లాజా మేనేజర్ ఎ.రమేష్, సేఫ్టీ మేనేజర్ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గణితంపై ఆసక్తి పెంపొందించాలి

సైదాపురం: విద్యార్థులకు గణితంపై ఆసక్తి పెంచే విధంగా బోధన చేయాలని ఎంఈఓలు దయాకర్‌రావు, సుప్రియ కోరారు. మండల కేంద్రమైన సైదాపురంలోని జీవీఎస్ఎన్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాపూరు, సైదాపురం మండలాల్లో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ రవి, రమణయ్య పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు ప్రశంసనీయం


గోపినాథ్‌రెడ్డి

దొరవారిసత్రం: విజయవాడ వరద సహాయక చర్యలు బుడమేరు పునరావాస కార్యక్రమాల్లో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అందించిన సేవలు ప్రశంసనీయమని ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్, ఏపీఆర్ఎస్ఏ కార్యదర్శి పి.గోపినాథ్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వరద బాధితులకు అన్ని సేవలు, సహాయక చర్యలు పూర్తి చేసి తిరిగి జిల్లాకు విచ్చేస్తున్న అందరికీ అభినందనలు తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ

దొరవారిసత్రం: గొల్లపాళెం గ్రామ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో భోజన పథకం నిర్వహణను మంగళవారం స్థానిక ఎంఈఓ కృష్ణయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాలలోని పలు రికార్డులను పరి శీలించారు. విద్యార్థులకు ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజనం అందేలా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా పాఠశాల ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఆయన వెంట హెచ్ఎం వెంగమ్మ ఉన్నారు.

ప్రోత్సహించేందుకే ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న మహిళా నాయకులు

గూడూరు రూరల్: కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూ విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో టాప్ ర్యాంకులో నిలిచిన విద్యార్థిని ప్రోత్సహించేందుకే ఆర్థిక సాయం అందిస్తున్నామని బలిజ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు పద్మావతి అన్నారు. పట్టణంలోని వీరభద్రస్వామి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం బలిజ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తిరుమలశెట్టి సుప్రజ అనే విద్యార్థినికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. సంఘం గౌరవ అధ్యక్షురాలు సారంగం సులక్ష్మీ, సువర్ణలక్ష్మీ, ఉషా, సాయిజ్యోత్స్న, శ్రావణి, రాధిక, రాధ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు


గడియారం సెంటర్ వద్ద అన్నదానం

నాయుడుపేట టౌన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు మంగళవారం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప, డాక్టర్ రంగినేని కృష్ణయ్య, పాపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కొప్పుల సుబ్రహ్మణ్యం, అత్తికాయల సుబ్రహ్మణ్యం, చిగురాకుల సురేంద్ర, అమరావతి రామయ్య, పి.రవి పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని కడపత్ర పంచాయతీలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 17 మందికి ఇళ్ల పట్టాలను మంగళవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ చేతుల మీదుగా లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. పేదలను ఆదుకునేందుకు తమ ప్రభుత్వం ముందు ఉంటుందన్నారు. అందరికీ ఇళ్ల మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

పేద పిల్లలు డాక్టర్లు కావొద్దా?



నిరుపేద కుటుంబాల్లోని పేద విద్యార్థులకు వైద్య విద్యను టీడీపీ ప్రభుత్వం దూరం చేసేందుకే ఇలాంటి అమానుష నిర్ణయాలు తీసుకుంటోంది. గత ప్రభుత్వం వైద్య విద్యను పేద విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసే ప్రతిపాదనలు తీసుకువచ్చింది. వాటిని రద్దు చేయాలని కేంద్రానికి లేఖ రాయడం దారుణమైన చర్య. పేదవిద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుంది. గత ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతి వైద్య కళాశాల ప్రారంభమయ్యేలా చూడాలి.

- ఎస్.సంయుక్త, ఇంటర్ బైపీసీ విద్యార్థిని, డీవీసత్రం



పేద విద్యార్థులు నష్టపోతారు



రాష్ట్రంలో కొత్తగా ప్రతిపాదించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను రద్దు చేసేలా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేయడం దారుణం. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే పేద విద్యార్థులకు తీవ్రంగా నష్టం జరుగుతుంది. కష్టపడి మెరిట్ సాధించే పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలా మారుతుంది. ప్రభుత్వ వైద్య కళాశాలలను రద్దు చేసే ప్రయత్నాలను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలి. పేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి.

- బి.రిషిత, బైపీసీ విద్యార్థిని, కొత్తపల్లి, డీవీ సత్రం

వైద్యం దూరం

గూడూరు నియోజకవర్గంలో...

గూడూరు మండలంలో పీహెచ్‌సీ	-	1
చిల్లకూరు మండలంలో పీహెచ్‌సీలు	-	4
కోట మండలంలో పీహెచ్‌సీలు	-	1
వాకాడు మండలంలో పీహెచ్‌సీలు,	-	4
చిట్టమూరు మండలంలో పీహెచ్‌సీలు	-	4

- బోసిపోయిన పీహెచ్‌సీలు
- ఓపీ సేవలు అందని గ్రామీణ ప్రాంత వైద్యశాలలు

వైద్యులు లేకపోవడంతో రోగులు రాక బోసిపోతున్న చిల్లకూరు పీహెచ్‌సీ


చిల్లకూరు: గ్రామీణ ప్రాంతాలలో పేదలకు వైద్యం అందని ద్రాక్షలా మారుతోంది. గత ప్రభుత్వ హయాంలో వైద్యం అందించే విషయంలో నేరుగా ఇంటి వద్దకు వెళ్లి వైద్యులు సేవలు అందించేలా చర్యలు చేపట్టారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు సేవలను బంద్ చేసి ఆందోళన బాట పట్టడంతో పేదలకు సేవలు అందించే పీహెచ్‌సీలలో మంగళవారం నియోజకవర్గంలోని అన్ని ఆసుపత్రుల్లో వైద్యసేవలు నిలిచి పోయి ఓపీ లేక ఆసుపత్రులు బోసిపోయాయి. ఒక వైపు మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తున్నట్లు సంకేతాలు పంపుతున్న ప్రభుత్వం వైద్య వృత్తిలోని వైద్యులు ప్రత్యేక కోర్సులు చేసేందుకు కూడా అడ్డంకి సృష్టించడంతో ఎంబీబీఎస్ చేసిన తమ పరిస్థితి ఏమిటని వైద్యులు ఆందోళన బాట పట్టారు. దీంతో గూడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని ఆసుపత్రుల్లో వైద్యులు లేక పోవడంతో అక్కడి సిబ్బంది మాత్రమే వైద్య సేవలు అందించారు. దీంతో పలు ఆసుపత్రులు వ్యాధిగ్రస్తులతో ఉండే ఓపీ నేడు బోసిపోయి కనపడ్డాయి.

పీజీ సీట్లు ఇవ్వక పోవడంతో అసంతృప్తి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేసే వైద్యులకు వృత్తి చేసుకుంటూనే పీజీ చదువు పూర్తి చేసుకునే వెసులుబాటు ఉండేది. అయితే నేడు రాష్ట్ర ప్రభుత్వం వీరికి పీజీ వైద్య సీట్లు ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఆసుపత్రుల్లో ఖాళీ అయిన పీజీ సీట్లకు మాత్రమే ఎంపిక చేస్తామని ప్రకటించింది. దీంతో ఎంబీబీఎస్ చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య వృత్తి చేస్తున్న తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన బాట పట్టారు. ఇలా పేదలకు వైద్య సేవలు అందించాల్సిన వైద్యులపై కూడా ప్రభుత్వం చిన్నచూపు చూడడంతో పేదలుకు ఎక్కడ వైద్యం అందుతుందని పలువురు పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

షుగర్‌కు చూపించుకుందామంటే వైద్యులు లేరు



చిల్లకూరులోని పీహెచ్‌సీకి వెళ్లి మధుమేహ వ్యాధికి చూపించుకుందామంటే అక్కడ వైద్యులు రావడం లేదని చెప్పారు. దీంతో చేసేది ఏమీ లేక గూడూరుకు వెళ్లి ప్రైవేటు వైద్యుల వద్ద చూపించుకోవాల్సి వచ్చింది. గతంలో ఎప్పుడు కూడా ఆసుపత్రిలో వైద్యులు లేకుండా ఉండేది లేదు.

- అన్నపూర్ణమ్మ, కమ్మవారిపాళెం, చిల్లకూరు మండలం

వైద్యులు లేరన్నారు



స్థానికంగా ఉన్న పీహెచ్‌సీకి వెళ్లి చూపించుకుందామని అనుకుని ఆసుపత్రికి వెళ్లా అక్కడకు వెళ్తే ఆసుపత్రిలో వైద్యులు లేరని సిబ్బంది చెప్పారు. జబ్బు చేసిన వారిని చూసేందుకు ఆసుపత్రిలో వైద్యులు లేక సిబ్బంది మాత్రమే ఉంటే అత్యవసరం అయితే పరిస్థితి ఏమిటి? ఇలాంటి స్థితి లేకుండా ప్రభుత్వం చేసుకోవాలి.

- రఘురామయ్య, చిట్టేడు, కోట మండలం

ఆసుపత్రిలో వైద్యులు లేక అవస్థలు



వాకాడు మండలం చినతోట పీహెచ్‌సీలో మంగళవారం డాక్టర్లు ఎవ్వరూ లేకపోవడంతో వివిధ రోగాలతో వచ్చిన రోగులు నానా అవస్థలు పడుతున్నారు. తన ఆరోగ్య సమస్యపై దాదాపు 5 కిలోమీటర్లు దూరం నుంచి బాడుగ ఆటోలో ఆసుపత్రికి వచ్చాను. దాదాపు రెండు గంటలపాటు ఆసుపత్రి వద్ద డాక్టర్ల కోసం పడిగాపులు కాచినా ఎవ్వరు రాలేదు. చివరికి చలో విజయవాడ అంటూ డాక్టర్లు అంతా నిరసన కార్యక్రమానికి వెళ్లారంటూ సిబ్బంది తెలిపారు. వెనుదిరిగి అదే ఆటోలో 30 కిలోమీటర్లు దూరంలోని కొత్తగుంట ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లడం జరిగింది.

- మునస్వామి, ఓడపాళెం, వాకాడు మండలం

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

వెంకటగిరి రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు నుండి 25వ వార్డు వరకు తాగునీరు సరఫరా చేయడంలో మోటార్లు మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 19వ తేదీన అన్నీ వార్డులకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌రషీద్ పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని సూచించారు.

కండలేరులో 14.362 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 14.362 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8100 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయి గంగ కాలువకు 170, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు గ్రామానికి చెందిన పూనిమాంగాడి జయచంద్ర(57) ఆదివారం పెళ్లకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నెల్లూరులో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పెళ్లకూరు నుండి మోపెడ్‌పై చిల్లకూరుకు వెళుతున్న జయచంద్రని తిరుపతి నుండి నెల్లూరుకు వైపు వెళుతున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన జయచంద్ర నెల్లూరులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య రాజమ్మ, తేజ, శశి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐదుగురు విద్యార్థులకు గాయాలు


వాకాడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

వాకాడు: జానరపేట వద్ద స్వర్ణముఖి నది కరకట్ట రహదారిపై డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఆటో నదిలోకి బోల్తాపడిన సంఘటనలో ఐదుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు కాశీపురం గ్రామం నుంచి పలువురు విద్యార్థులు రోజూ ఆటోలో చిట్టమూరు మండలం మెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం స్కూల్‌కి వెళ్లి తిరిగి వస్తుండగా జానరపేట గ్రామం వద్ద ప్రమాదవశాత్తు ఆటో నదిలోకి బోల్తా కొట్టింది. ఆటోలో ఉన్న 7వ తరగతికి చెందిన విద్యార్థులు అమృతవర్ష, హిమబిందు, యశ్వంత్, 8వ తరగతి విద్యార్థి లోకేష్, ఇంటర్ విద్యార్థిని మాధవికి గాయాలు తగిలాయి. వీరిని చికిత్స నిమిత్తం వాకాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

19 నుంచి స్కూల్‌గేమ్స్‌కు క్రీడాకారుల ఎంపిక

రాపూరు: విద్యార్థుల స్కూల్‌గేమ్స్‌కు క్రీడాకారుల ఎంపిక 19వ తేదీ నుంచి జరుగుతుందని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం దయాకర్ తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో వాలీబా ల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ తదితర పోటీలు ఉంటాయన్నారు. పూర్తి సమాచారం కోసం పీడీ రమేష్ బాబును సంప్రదించాలని వివరించారు.

ముత్యాలమ్మ ఆలయంలో చండీహోమం


ముత్యాలమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న చండీ హోమం

చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం చండీ హోమం నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి ఆలయంలో చండీ హోమం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగానే అమ్మవారికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు చేసిన అనంతరం ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో అమ్మవారికి చండీ యాగం నిర్వహించే ఉభయకర్తలు పూజా సామగ్రిని మేళతాళాల మధ్య భక్తి శ్రద్ధలతో యాగ మండపానికి తీసుకునివచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు శివప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులు చండీ హోమం నిర్వహించి తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. చండీ హోమం చేయడంతో ప్రజలు సుఖశాంతులతో ఉంటారని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా చెన్నైకు చెందిన పొక్కాళి బాలాజీ దంపతులు వ్యవహరించగా ఆలయ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, ఆలయ ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ

గూడూరు రూరల్: రెండో పట్టణ పరిధిలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ కళాశాల సమీపంలో ఓ మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఎస్‌కేఆర్ ప్రభుత్వ కళాశాల సమీపంలో తిలక్‌నగర్‌కు చెందిన అనురాధ అనే మహిళ దుకాణం నిర్వహిస్తోంది. మంగళవారం ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి శీతల పానీయాలు ఇవ్వాలని అడిగారు. అవి ఇచ్చేలోగా ఆమె మెడలోని 12 సవర్ల బంగారు గొలుసును లాక్కుని మోటరు సైకిల్‌పై పరారయ్యారు. దీంతో ఆమె కేకలు వేస్తూ బయటకు వచ్చింది. స్థానికులు వారిని వెంబడించినప్పటికీ దొరకలేదు. దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైల్వే గేట్ మూసివేత

సూళ్లూరుపేట: పట్టణం నడిబొడ్డున ఉన్న రాఘవయ్యపేట రైల్వేగేట్‌ను మూడు రోజులపాటు మూసివేస్తున్నామని రైల్వే అధికారులు స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని పంపించారు. ఈ రైల్వేగేట్ మరమ్మతులున్న కారణంగా మంగళవారం నుంచి బుధ, గురు వారాలు పూర్తిగా గేట్ మూసి వేస్తున్నామని తెలియజేశారు. ఈ గేట్ ద్వారా ప్రయాణించే వారికి మూడు రోజులపాటు అంతరాయానికి తగినట్టుగా ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను వాడుకోవాలని తెలిపారు. ప్రస్తుతం గేట్ కొంత సాంకేతిక పరమైన కారణాలతో బ్రేక్ అవుతోందని, దీన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలంటే మూడు రోజులు సమయం తప్పదని, సహకరించాలని రైల్వే అధికారులు కోరారు.

జేసీబీ, 7 ట్రాక్టర్లు పట్టివేత


మట్టి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్

నాయుడుపేట టౌన్: పుదూరు పంచాయతీ మిట్టకండ్రిగ గ్రామ చెరువులో ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా మట్టి తవ్వుతున్న ఒక జేసీబీ, 7 ట్రాక్టర్‌లను తహసీల్దార్ గీతావాణి మంగళవారం సాయంత్రం పట్టుకున్నారు. చెరువులో జేసీబీతో భారీగా తవ్వకాలు చేపట్టి మట్టిని ట్రాక్టర్లలో తరలిస్తుండడంతో తహసీల్దార్‌కు సమాచారం అందింది. దీంతో చెరువులో తవ్వకాలు చేస్తున్న జేసీబీతోపాటు 7 ట్రాక్టర్‌లను పట్టుకున్నారు.

మైనింగ్ అధికారులకు వాహనాలు అప్పగింత

సైదాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఖనిజంతోపాటు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు పట్టుకుని మంగళవారం జిల్లా మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖనిజంతోపాటు ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరైనా ఖనిజాన్ని, ఇసుకను తరలిస్తేవారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు


బ్లీచింగ్ స్టాక్ పాయింట్ పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భానుప్రియ

వెంకటగిరి రూరల్: శ్రీపోలేరమ్మ తల్లి జాతర సమయంలో విచ్చేసిన భక్తులు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్, మోటార్లు, జీనిగుల వారి వీధిలోని డ్రైనేజీ కాలువలు, బ్లీచింగ్ స్టాక్ పాయింట్‌లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 25, 26వ తేదీన నిర్వహించనున్న పోలేరమ్మ తల్లి జాతరలో లక్షలాది మంది భక్తులు వెంకటగిరికి విచ్చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చొరవ తీసుకుని పుష్కలంగా నీరు అందేలా చర్యలు చేట్టాలన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీలో అన్నీ వార్డుల్లో పారిశుధ్య పనులు నిర్వహించి శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌రషీద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, కౌన్సిలర్ ఎ.శ్రీనివాసులు, గోపాలకృష్ణ, నాయకులు పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


మాత్రలు పంపిణీ చేస్తున్న సీడీపీఓ శంషాద్‌బేగం


మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

వెంకటగిరి రూరల్: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పాతకోట పీహెచ్‌సీ వైద్యుడు రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థినులకు నులిపురుగుల నివారణలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. సీడీపీఓ శంషాద్‌బేగం, హెల్త్‌సెక్రటరీ ఎం.సత్యవేణి, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. పట్టణంలోని కాలేజీమిట్ట సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ శంషాద్ బేగం ఆధ్వర్యంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఆరోగ్య నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ కల్పలత, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ తదితరులు పాల్గొన్నారు.

రాపూరులో...

రాపూరు: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించామని ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. గురుకుల పాఠశాల్లోని విద్యార్థినులకు మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండ లంలో 1 నుంచి 19 సంవత్సరాల వయసున్న వారు 10,900 మంది ఉండగా మంగళవారం 10,054 మందితో మాత్రలు మింగించినట్లు తెలిపారు. మిగి లిన వారికి ఈ నెల 25వ తేదీలోపు మింగిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.

చిల్లకూరు: చిన్నారులు ప్రతి ఆరు నెలలకు ఒక సారి నులి పురుగుల మందు వాడాలని హెల్త్ సూపర్‌వైజర్ రవి సూచించారు. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా చిల్లకూరు మండలంలోని అన్నిగ్రామాల్లోని పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు భోజనం అనంతరం నులి పురుగుల మాత్రలను మింగించారు. వైద్య సిబ్బంది, చిల్లకూరు గురుకుల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ మీరా సాహెబ్ పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారి లడ్డూ విక్రయాలు


లడ్డూ విక్రయ కేంద్ర ప్రారంభోత్సవం

నాయుడుపేట టౌన్: పట్టణ పరిధిలోని తుమ్మూరులో టీటీడీకి అనుబంధంగా ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఆలయంలో మంగళవారం నుంచి తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయిస్తున్నట్లు టీటీడీ ఉప కార్యనిర్వాహణాధికారి దేవేంద్రబాబు తెలిపారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి లడ్డూ విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి రోజు ఆలయంలో దర్శన సమయాల్లో భక్తులకు తిరుమల శ్రీవారి లడ్డూలు విక్రయిస్తామన్నారు. ఆలయ దర్శన సమయాలు ఉదయం6 గంటల నుంచి 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8 వరకు లడ్డూలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. టీటీడీ సూపరింటెండెంట్ జ్ఞానకిషోర్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరిరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


వాకాడులో విద్యార్థుల మానవహారం


స్వచ్ఛతా హీ సేవపై అవగాహన ర్యాలీ

వాకాడు: కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పరిసరాల పరిశుభ్రతపై అధికారులు వాకాడులో అవగాహన ర్యాలీ, మానవ హారం చేపట్టారు. ఈ ర్యాలీలో ఎంపీడీఓ మనోహర్‌గౌడ్ మాట్లాడుతూ ఇల్లు, పాఠశాలలు, రైల్వేస్టేషన్, ఆరోగ్య కేంద్రాలు, బస్టాండ్లు, చెరువుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే బహిరంగ మూత్ర విసర్జన రహితంగా గ్రామాలను కాపాడుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు, అధికారులు ఎంపీడీఓ కార్యాలయం నుంచి స్థానిక అశోక స్తంభం కూడలి వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగబాబు, ఎంఈఓ నసీంఆలీ తదితరులు పాల్గొన్నారు.

సైదాపురంలో ర్యాలీ

సైదాపురం:మండల కేంద్రమైన సైదాపురంలో మంగళవారం స్వచ్ఛతాహి సేవపై అవగాహన ర్యా లీ నిర్వహించారు. సైదాపురం ఎంపీడీఓ పురుషో త్తం శివకుమార్ అధ్యక్షతన ఆస్పత్రి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో స్వచ్ఛత కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు

కోటలో..

కోట: ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ భవానీ సూచించారు. మండలంలోని వంజివాకలో స్వచ్ఛతాహిసేవ కార్యక్రమాన్ని చేపట్టారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని ఎంపీడీఓ భవానీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మస్తానయ్య, పంచాయతీ కార్యదర్శి రియాజ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం

ఓజిలి: పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరమవుతాయని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. ఓజిలి గ్రామంలో మంగళవారం స్వచ్ఛతాహి సేవ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, హోటళ్లు, బస్టాండ్, చెరువులు, నీటి గుంటలు, సంచార ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. మరుగుదొడ్లను ప్రతి ఒక్కరు నిర్మించుకుని వినియోగించాలన్నారు. గ్రామాల్లోని చెత్తాచెదారాలను చెత్తసంపద కేంద్రాలకు తరలించాలని తెలిపారు. అనంతరం స్వచ్ఛతాహి సేవా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమన్‌రెడ్డి, ఏపీఎం నిర్మలమ్మ, ఎంఈఓ శైలజ, ఏపీఓ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి సిరాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని చెన్నప్పనాయుడుపేట, చెంబేడు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై అవగాహన చేశారు. విద్యార్థులు, గ్రామస్తులు ప్లకార్డులు చేతపట్టుకుని ఆయా గ్రామాల్లోని ప్రదాన వీధుల్లో పరిసరాలు పరిశుభ్రతపై నినాదాలు చేస్తూ అవగాహన చేశారు. వ్యక్తిగత శుభ్రత, పచ్చదనం పరిశుభ్రత, రోజువారీ వ్యాయామ కార్యక్రమాలు, ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, ఏవో అన్నపూర్ణారావు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు మస్తాన్‌రెడ్డి, రమణయ్య, మల్లిరెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

గూడూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో కూడా పరిశుభ్రతకు చోటు ఇస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో చూడాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా పిలుపు నిచ్చారు. పట్టణంలోని కూరగాయాల మార్కెట్ ప్రాంతంలో గూడూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌తో కలసి పాల్గొని వీధులను శుభ్రం చేశారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.